

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....


# వన్ నేషన్


RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 274 ఎడిటర్: కె.యువరాజ్ బుధవారం 15-7-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్ధిక
శుభాకాంక్షలు





## కేంద్రంతో సఖ్యతగా..

- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు.. అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేదు - ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి - వరంగల్ విమానాశ్రయ పనులు ప్రారంభించండి - ఆదిలాబాద్ విమానాశ్రయానికి భూ సేకరణ చేస్తాం - హుస్సేన్‌సాగర్-ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్ నడపండి - కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి రేవంత్ విజ్ఞప్తి - ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి అనుమతులు ఇవ్వండి - ఫ్యూచర్‌సిటీ-బందరు పోర్టు గ్రీన్‌ఫీల్డ్ రోడ్ మంజూరు చేయండి.. కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం వినతి

**న్యూఢిల్లీ, జులై 14 (వన్‌నేషన్):** రాజకీయాలను కేవలం ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావివ్వకూడదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, నితిన్ గడ్కరీలతో భేటీ అయ్యారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో కలిసి రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని తాము సంపూర్ణంగా విశ్వసిస్తున్నామన్నారు. "రాజకీయాలు అనేవి ఎన్నికలు వచ్చినప్పుడు ఉంటాయి. ఎవరి ప్రయత్నం వాళ్లు చేసుకుంటారు. కానీ, ప్రస్తుతం అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు వెళ్తున్నాయి. ఎక్కడైనా ఆలస్యం జరిగినా, సమాచార లోపం ఉన్నా అది చర్చల ద్వారానే పరిష్కారం అవుతుంది. అందుకే పదేపదే కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి పదేపదే ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారంటూ కొందరు గిట్టనివాళ్లు విమర్శిస్తున్నారని..ఈ విషయాన్ని వారి విచక్షణకే వదిలేస్తున్నానని అన్నారు. తానేమీ సొంత పనుల కోసం ఢిల్లీకి రావడం లేదని, ప్రజల కోసమే వస్తున్నానని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అనుమతులపై సోమవారమే రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలను పిలిచి పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చామని

5లో




## చెప్పాం.. చేస్తున్నాం

- ఐదేళ్లూ విద్యుత్ చార్జీలు పెంచేది లేదు - 36 ప్రాజెక్టులు ప్రాధాన్య క్రమంలో పూర్తి - నెలవారీ ఆర్థిక నివేదికలతో మరింత అభివృద్ధి - ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం - మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడీలతో భేటీ - ఉద్యోగులు, అధికారులకు అభినందనలు - ఉన్నతస్థానాల్లో ఉన్న కొందరు అభివృద్ధి నిరోధకులుగా ఉన్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు

**అమరావతి, జులై 14 (వన్‌నేషన్):** "ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే ఉన్నతస్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లాలి. వినూత్న ఆలోచనలతో సుపరిపాలనను ప్రజలకు అందించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు, విభాగాల అధిపతులతో (హెచ్‌వోడీ) మంగళవారం సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నెలవారీ ఆర్థిక నివేదికలపై సమీక్షించారు. "ఒక మంచి అధికారి సమస్యను పరిష్కరిస్తే... అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చేస్తారు"... అనే కోణంలో పనితీరు కనబరచాలని సీఎం సూచించారు. "ప్రభుత్వం మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ చార్జీలు పెంచలేదు. ఐదేళ్లపాటు విద్యుత్ చార్జీలు పెంచేదిలేదని చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. ట్రూడౌన్‌ను కూడా అమలు చేస్తున్నాం. పట్టిసీమ నీటితో గోదావరి నుంచి కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరు అందించగలుగుతున్నాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో జలసంరక్షణ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు మొదటి దశ పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. "ఆగస్టు 14న అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాం. సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తిచేస్తాం" అని ప్రకటించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములై సహకరిస్తున్న అధికారులు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. అదే సమయంలో... కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు అభివృద్ధి నిరోధకులుగా ఉన్నారని, ఇది సరికాదని హెచ్చరించారు. గత ప్రభుత్వ పాలనలో కొన్ని శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవడంతో

5లో

## అప్పుడు ముగ్గురు.. ఇప్పుడు అందరూ!

- సింగరేణిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వేల కోట్లు దోపిడీ.. పదేళ్లలో రూ.26 వేల కోట్లు కొల్లగొట్టిన బీఆర్ఎస్



**భూపాలపల్లి జూలై 14 (వన్‌నేషన్):** సింగరేణిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వేల కోట్లు దోచుకున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గతంలో ఓ వెలుగు వెలిగిన సింగరేణిలో నేడు నీలినీడలు కమ్ముకున్నాయని, అవినీతి అక్రమాల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. సింగరేణి భరోసా యాత్రలో భాగంగా ఆయన మంగళవారం భూపాలపల్లి, మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో పర్యటించారు. కార్మికులతో, క్యాతన్‌పల్లి, జీడీకే ఓపెన్‌కాస్టు 5 ఆవరణలో నిర్వహించిన సభల్లో మాట్లాడారు. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల బ్లాక్ 2 గని భూములను పరిశీలించి స్థానికులతో ముచ్చటించారు. పదేళ్లలో బీఆర్ఎస్ సింగరేణిలో రూ.26 వేల కోట్లు దోచుకుంటే ఈ రెండున్నరేళ్లలో కాంగ్రెస్ రూ.27 వేల కోట్లు దోచుకుందని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ బంగారు బాతులా వాడుకుంటున్నాయన్నారు. అప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్, కవిత దోచుకుంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో హోల్‌సేల్‌గా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. తాడిచర్ల బ్లాక్ 2 బొగ్గు గని ప్రాజెక్టు రాష్ట్రానికి ఒక మణికిరీటం కానుందని, దాంతో ఈ ప్రాంత ఆర్థిక రూపురేఖలు మారిపోనున్నాయన్నారు. వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, వ్యాపారాభివృద్ధి జరగడంతో పాటు చిన్నతరహా అనుబంధ పరిశ్రమలు వస్తాయని చెప్పారు.




## రుతుపవనాల్లో మళ్లీ కదలిక!

### త్వరలో అల్పపీడనం.. విస్తారంగా వర్షాలు?

**న్యూఢిల్లీ, జులై 14 (వన్‌నేషన్):** ఎల్‌నినో ప్రభావంతో భారత్‌లో ప్రస్తుతం వర్షాకాలం కూడా వేసవిని తలపిస్తోంది. కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండ, ఉక్కపోత అల్లాడిస్తున్నాయి. రుతుపవనాలు నిస్తేజంగా మారడమే దీనికి కారణం. అయితే.. దేశవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొన్న తరుణంలో.. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న కొత్త వాతావరణ పరిస్థితులు రుతుపవనాలకు కొత్త ఊపిరిలూదుతూ.... వర్షాలపై ఆశలు రేపుతున్నాయి. పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన కొన్ని వాతావరణ పరిస్థితులు బంగాళాఖాతం వైపునకు పయనిస్తున్నాయి. వీటి ప్రభావంతో దేశంలో కొంతకాలంగా బలహీనపడిన రుతుపవనాలు మళ్లీ పుంజుకోనున్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో జరుగుతున్న ఈ మార్పుల వల్ల సముద్రపు గాలులు బలంగా వీస్తూ, దట్టమైన మేఘాలు అలముకుంటున్నాయి. రెండు, మూడు రోజుల్లో ఈ పరిస్థితి మరింత బలపడి అల్పపీడనంగా మారనుంది. ఈ అల్పపీడనం క్రమంగా ఒడిశా, పశ్చిమబెంగాల్ వైపు పయనించి తూర్పు భారతంలో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత దీని ప్రభావం మధ్య, ఉత్తర భారతంపైనా ఉంటుంది. దీంతో తూర్పు, మధ్య, ఉత్తర భారతంలో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ రుతుపవనాల సీజన్‌లో బంగాళాఖాతంలో రెండో అల్పపీడనం ఏర్పడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ పరిస్థితి ఇప్పటికే బలహీనపడిన రుతుపవనాలకు కొత్త ఊతమిస్తుందని తెలిపింది. ఈ అల్పపీడనం రుతుపవనాలను మరింత చురుకుగా కదిలేలా చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఇది ఎంతవరకు విస్తరిస్తుందనేది దాని బలం, మార్గం, తీవ్రత, కాలపరిమితిపై ఆధారపడి ఉంటుందని భావిస్తున్నారు.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి




ఎమ్మిగనూరు జూలై 14 MD యూసుఫ్ (వన్ నేషన్): ఖరీఫ్ సీజన్ వర్షాలు లేక ఎల్ నినో కూరల్లో చిక్కుకున్న రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. గత ప్రభుత్వం మాదిరిగా కూటమి ప్రభుత్వమే ఉచిత పంటల బీమా ప్రీమియంను చెల్లించాలని కోరుతూ సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్ లో రాస్తారోకో అనంతరం అగ్రికల్చర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు అగ్రికల్చర్ అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. CPI-AIKSపాల్గొన్నారు.

# పరిశుభ్రతే నులిపురుగులకు విరుగుడు

## ప్రొఫెసర్ లిల్లీ మేరి



హైదరాబాద్, జులై 14 (వన్‌నేషన్): పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి రెడీ అయిన క్షణంలోనే కడుపునొప్పి అంటూ విల్లవిల్లాడుతారు. కొందరు తల్లిదండ్రులు బడి తప్పించుకోవడానికి అనుకుంటారు. మరికొందరు ఆకస్మాత్తుగా వచ్చే నొప్పిని చూసి గాబరా పడతారు. ఒక్కోసారి ఇది నులిపురుగుల వల్ల అయ్యి ఉండవచ్చు. పిల్లల ఆరోగ్యం పై అప్రమత్తంగా ఉండే తల్లిదండ్రులను ఇబ్బందికి గురి చేసే నులిపురుగులు తయారు కావడానికి ప్రధాన కారణం పరిశుభ్రత పాటించక పోవడమే అని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి అన్నారు. నులిపురుగులతో ఒక్కోసారి ప్రాణాంతకమైన సమస్యలు కూడా వస్తాయి. రక్తహీనతకు 60 శాతం నులిపురుగులే కారణం అని ఆచార్యులు లిల్లీ మేరి తెలిపారు. జులై 20న నిర్వహించే మాప్ – అ ప్ డే సందర్భంగా మొదటి విడతలో మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు అందజేయాలని లిల్లీ మేరి అన్నారు. సంవత్సరం పిల్లవాడి నుండి 19 సంవత్సరాల యువకుడి వరకు పొట్టలో పెరిగే పురుగులతో బాధపడుతూనే ఉంటారు. నులిపురుగులు, కొరడా పురుగులు, కొంకి పురుగులు, బద్దె పురుగులు, ఏలిక పాములు, దారపు పురుగులు లాంటివి మన పొట్టలు చేరి అనేక రోగాలకు కారణం అవుతుంటాయి అని ఆచార్యులు లిల్లీ మేరి తెలిపారు.

### పిల్లల్లో తలెత్తే సమస్యలు:

రక్తహీనత, ఆకలి మందగించడం, శారీరకంగా బలహీనులు కావడం, కడుపునొప్పి, వికారముగా ఉండడం, వాంతులు, విరోచనాలు, మలములో రక్తం రావడం, మానసిక ఆందోళన వంటి అనేక రకాల సమస్యలకు నులి పురుగులు కారణమవుతాయని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి అన్నారు.

### ఎలా వ్యాపిస్తాయి అంటే:

నులిపురుగుల గుడ్లు మలము ద్వారా బయటకు వచ్చి మట్టిని కలుషితం చేస్తాయని, ఈ గుడ్లు మట్టిలో లార్వాలుగా ఉంది చెందుతాయని లిల్లీ మేరి అన్నారు. పిల్లలు మట్టిలో ఆడుకోవటం, చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహారం తీసుకోవడం వలన ఈ గుడ్లు లార్వాలు వారి లోపలికి చేరుకుంటాయని, పిల్లల్లో చేరిన లార్వాలు, గుడ్లు, క్రిములుగా వృద్ధి చెందుతాయని, ఎదిగిన నులిపురుగులు తిరిగి గుడ్లను ఉత్పత్తి చేసి పిల్లలకు అనారోగ్యం కలిగిస్తాయని లిల్లీ మేరి తెలిపారు.

### ఒక్క మాత్రతో నులిపురుగులకు చెక్:

తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా పిల్లల్లో నులిపురుగులు పెరగకుండా జాగ్రత్త పడవచ్చని ముఖ్యంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రం తప్పనిసరిగా వేయాలని, ఈ మాత్రలను పంపిణీకై ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు గ్రామాలల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందని, ఒకటి నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఏవైనా కారణాలతో పాఠశాలలకు వెళ్ళని పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలోనూ, 6 నుండి 19 సంవత్సరాల పిల్లలకు వారు చదువుకునే పాఠశాల ల్లో ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఈమాత్రలు వేస్తారని ఆచార్యులు లిల్లీ మేరి పేర్కొన్నారు.

### మాత్రలతో ప్రయోజనాలు ఎన్నో:

ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవడంతోపాటు వైద్యుల సూచనకు అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలను క్రమం తప్పకుండా వెయ్యడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధానంగా నులిపురుగుల భారి నుండి పిల్లలను కాపాడవచ్చు. రక్తహీనత,,పోషకాహార లోపము వంటి సమస్యలు అధిగమించవచ్చు. పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుంది. శారీరక, మానసిక పెరుగుదలతో పాటు వికాసం పెంపొందుతుంది. పనిచేయగలిగే సామర్థ్యం పెరుగుతుంది. దీర్ఘకాలిక వ్యాధులు గల వారికి మాత్రలు వేయరాదని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి పేర్కొన్నారు.

### తీసుకోవలసిన జాగ్రత్తలు:

జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చని, తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సహాయ ఆచార్యులు లిల్లీ మేరి తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయరాదు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తరువాత సబ్బుతో కాళ్లు, చేతులు కడుక్కోవాలి.బయటకు వెళ్లేటప్పుడు చెప్పులు ధరించేలా చూడాలి. పెరిగిన గోళ్ళను ఎప్పటికప్పుడు తొలగించాలి. చేతి వేళ్లలో మట్టి లేకుండా ఉంచుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి. వేడి ఆహారం తీసుకోవడంతో పాటు ఆహారంపై ఎప్పుడు కప్పి ఉంచాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి పేర్కొన్నారు. నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులు అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తగు సలహాలు, సూచనలు అందిస్తారని మాత్రను వేయడానికి వచ్చే ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. విద్యార్థులు మాత్రను నేరుగా మింగకుండా చప్పరించిన తర్వాత మిగిలిన మాత్రను మింగేలా చూడాలని లిల్లీ మేరీ అన్నారు. 6 నుంచి 18 సంవత్సరాల లోపు వారికి పూర్తి మాత్రను ఆరేళ్లలోపు వారికి సగం మాత్రను వేయాలని, సమీపంలోని ఆరోగ్య కేంద్రం ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని, కడుపులో నులిపురుగులు ఎక్కువగా ఉండే విద్యార్థులకు వాంతులు, విరోచనాలు, తలనొప్పి, కడుపునొప్పి వంటి ప్రతికూల పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని, అయితే వీటి వల్ల ఎలాంటి నష్టముండదని, వారిని కేవలం నీడలో కూర్చోబెడితే సరిపోతుంది అని, మాత్ర గొంతులో ఇరుక్కుపోయిన సందర్భంలో వారిని తొడలపై కూర్చోబెట్టుకొని వీపుపై మాత్ర బయటకు వచ్చేవరకు తట్టాలని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి పేర్కొన్నారు.

# అత్యవసర పరిస్థితులకు సన్నద్ధంగా ఉండాలి

**- తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన, అత్యవసర & పౌర రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ - పాఠశాలలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన**




హైదరాబాద్, జులై 14 (వన్‌నేషన్): పాఠశాలలలో అత్యవసర పరిస్థితులకు సన్నద్ధంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన, అత్యవసర & పౌర రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ తెలిపారు. విద్యార్థుల భద్రత, విపత్తు సన్నద్ధత లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన, అత్యవసర & పౌర రక్షణ శాఖ, 'బేసిక్ ఎలిమెంట్స్' కలిసి నగరంలోని రవీంద్ర భారతిలో పాఠశాల యాజమాన్యాల కోసం ఏర్పాటు చేసిన అగ్నిమాపక భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అగ్నిమాపక భద్రత అనేది కేవలం ఒక చట్టబద్ధ మైన నిబంధన మాత్రమే కాదని, అది మనందరి ఉమ్మడి బాధ్యతని తెలిపారు. ప్రతి విద్యా సంస్థ అత్యవసర పరిస్థితులను నివారించడానికి, ప్రమాదం సంభవిస్తే సమర్థవంతంగా స్పందించడానికి సిద్ధంగా ఉండాల న్నారు. అవగాహన, సన్నద్ధత, క్రమం తప్పకుండా నిర్వహించే భద్రతా తనిఖీలు ఎన్నో ప్రాణాలను కాపాడతాయన్నారు.

ఈ సందర్భంగా గౌరవ అతిథి తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ మాట్లాడుతూ ప్రతి బిడ్డకూ సురక్షితమైన, రక్షణతో కూడిన వాతావరణంలో చదువుకునే హక్కు ఉందన్నారు. పాఠశాల యాజమా న్యాలు నిబంధనలు అమలు చేయాలన్నారు. క్రమం తప్పకుండా తనిఖీలు చేయడం, సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా అగ్నిమాపక భద్రతను క్యాంపస్ పరిపాలనలో ఒక భాగంగా మార్చాలన్నారు.

ఈ సందర్భంగా బేసిక్ ఎలిమెంట్స్ వ్యవస్థాపక డైరెక్టర్ & సీఈఓ ప్రసాద్ నిష్టల మాట్లాడుతూ ప్రమాదా లు జరగక ముందే నివారించడంలో సాంకేతికత అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. స్మార్ట్ మానిటరింగ్, ముందస్తు భద్రతా పరిష్కారాల ద్వారా, పాఠశాలలు తమ సన్నద్ధతను బలోపేతం చేసుకోవచ్చన్నారు. తద్వారా విద్యార్థులకు, సిబ్బందికి, పాఠశాల మౌలిక వసతులకు రక్షణ కల్పించవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదాల ముప్పును అంచనా వేయడం, ప్రమాదాల నివారణ చర్యలు, అత్యవసర ప్రతిస్పందన ప్రోటోకాల్స్, ఖాళీ చేయించే ప్రణాళికలు, అగ్నిమాపక రక్షణ వ్యవస్థలు, చట్టబద్ధమైన నిబంధనల అమలు, సురక్షితమైన విద్యా ప్రాంగణాలను నిర్వహించడంలో పాఠశాల యాజమాన్యాల బాధ్యతలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'బేసిక్ ఎలిమెంట్స్' పాఠశాలల కోసం రూపొందించిన తమ 'స్మార్ట్ ఐఓటీ మానిటరింగ్ సొల్యూషన్స్' ప్రత్యక్ష ప్రదర్శన (లైవ్ డెమో) నిర్వహించింది. సాంకేతికత ద్వారా కీలకమైన అగ్నిమాపక భద్రతా వ్యవస్థలను రియల్ టైమ్లో ఎలా పర్యవేక్షించవచ్చో, ప్రమాద సమయాల్లో తక్షణ హెచ్చరికలను ఎలా పొంద వచ్చో, నిబంధనల అమలును ఎలా మెరుగుపరచవచ్చో, అత్యవసర సన్నద్ధతను ఏ విధంగా పెంపొందించుకోవచ్చో ఇందులో ప్రాక్టికల్‌గా చూపించారు. తెలంగాణాలో ఉన్న విద్యా సంస్థలు అగ్నిమాపక భద్రత, విపత్తు సన్నద్ధత పట్ల ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించేలా ప్రోత్సహిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. తెలంగాణాలో ఉన్న విద్యా సంస్థల నుంచి 500 మందికి పైగా పాఠశాల యజమానులు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ సీనియర్ అడ్మినిస్ట్రేటర్లు హాజరయ్యారు.

దేశవ్యాప్తంగా వివిధ విద్యా సంస్థలలో చోటు చేసుకున్న విషాదకర అగ్ని ప్రమాదాల నేపథ్యంలో ఈ కార్యక్రమం ప్రాధాన్యతను సంతరించుకుంది. భద్రతా లోపాలు, సరైన నివారణ చర్యలు లేకపోవడం వల్లే అమాయక ప్రాణాలు బలికావాల్సి వచ్చింది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధతను బలోపేతం చేయడం, విద్యార్థులు, సిబ్బందికి సురక్షితమైన అభ్యాస వాతావరణాన్ని కల్పించడంపై పాఠశాల యాజమాన్యాలకు అవగాహన కల్పించే లక్ష్యంతో సాగింది. ఈ కార్యక్రమంలో బేసిక్ ఎలిమెంట్స్ పాఠశాలల కోసం రూపొందించిన 'ఎఫ్ఐఓటీ' స్మార్ట్ ఐఓటీ మానిటరింగ్ సొల్యూషన్ను ఆవిష్కరించింది. ఇది భారతదేశంలో మొదటిసారి స్వతంత్ర సంస్థల కోసం రూపొందించిన స్టాండ్అలోన్ స్మార్ట్ ఫైర్ డిటెక్టర్. పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు, క్లినిక్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, కార్యాలయాలు, ఫార్మసీలు, రెస్టారెంట్లు తదితర చిన్న వాణిజ్య సంస్థల్లో అగ్ని ప్రమాదాలను సులభంగా గుర్తించవచ్చు. మొబైల్ ఫోన్ లేదా వెబ్ బ్రౌజర్ ద్వారా ఎక్కడ నుంచైనా తమ సంస్థను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే సౌకర్యాన్ని ఇది అందిస్తుంది. బీఈ-ప్రాంప్ట్, ఇగ్నికాప్ వంటి దేశంలోనే మొదటిసారి రూపొందించిన వినూత్న ఉత్పత్తులను కూడా ప్రదర్శించారు. అగ్నిప్రమాదం వంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులు, బాధ్యులు, ఇతర నిర్దేశిత వ్యక్తులకు తక్షణ హెచ్చరికలు పంపే అత్యవసర సమాచార వ్యవస్థలుగా ఇవి పని చేస్తాయి. మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9963980259



# కాప్రా మండల ఎంఈఓగా అజామొహినుద్దీన్ నియామకం



జవహర్ నగర్ వన్ నేషన్ : జవహర్ నగర్‌లోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎం.డి. అజామొహినుద్దీన్ ను కాప్రా మండలానికి పూర్తి అదనపు బాధ్యతలతో మండల విద్యాధికారిగా నియమితులయ్యారు.

ఈ మేరకు ఏ.డి. లింగానందం, ఏ.ఎస్.ఓ. అయ్యన్న, కలిసి అజామొహినుద్దీన్ ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

### -సీఎం రేవంత్ సర్కార్ కృషి - మేడిపల్లి పాఠశాల సందర్శన లో గోగుల సరిత

**మేడిపల్లి /జూలై 14/వన్ నేషన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రభు త్వ పాఠశాలల్లో మౌలిక వస తుల కల్పనతో పాటు నాణ్య మైన విద్యను అందిం చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీ ఎస్ సి పి సి ఆర్ ) సభ్యురాలు గోగుల సరిత పేర్కొ న్నారు.మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడు ప్పల్ సర్కిల్, 9వ డివిజన్ మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భం గా మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవితో కలిసి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వ






పథకాలను సద్విని యోగం చేసుకుని, విద్యార్థు లు ఉన్నత లక్ష్యాలను చేరుకో వాలని ఆమె సూచించారు.

పాఠశాల సందర్శనలో భాగంగా, విద్యార్థులతో కలిసి గోగు ల సరిత, తుంగతుర్తి రవి మధ్యాహ్న భోజనం చేశారు. భోజన నాణ్యత, పాఠశాల పరిశుభ్రత మరియు అందు బాటులో ఉన్న వసతులపై ఆరా తీశారు. పాఠశాలలో సిబ్బంది కొరత ఉందని విద్యా ర్థులు, ఉపాధ్యాయులు ఆమె దృష్టికి తీసుకురాగా, ఆ సమస్యలను సంబంధిత అధికారు లతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని, పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అంది స్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయ కులు బలరాం, మహ్మద్ మజ ర్, ప్రణయ్, బర్రె నాగరాజు, సోమయ్య, కాటపాక కుమా ర్, సునిల్, జయందర్, శరత్ గౌడ్, సాయిరాం గౌడ్, భరత్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యా యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసి శాఖామాత్యులు ఎస్ సబితా తో భేటీ ఐన
# ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేపీసీ ప్రతినిధి వర్గం

**అమరావతి, జులై 14 (వన్‌నేషన్):** గరిటపల్లి మహేంద్ర హత్య కేసు విషయంలో న్యాయం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ వర్గం క్యాంప్ కార్యాలయంలో బిసి శాఖ మాత్యు లు సవిత ని స్వయంగా కలిసి బాదిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతి పత్రం అందించి కోరటం జరిగింది.



మంత్రిసబితా గారు వెంటనే స్పందిస్తూ బాధిత కుటుంబానికి టిట్ కో ఇల్లు ఇవ్వాలని గుడివాడ మ్మెల్యే వెనిగండ్ల రాము తో మాట్లాడగా టిట్ కో ఇల్లు అవకాశం లేదు ఇంటి స్థలం తప్పకుండ ఇద్దాం అని చెప్పారు. ఎక్స్గ్రేషియా విషయం కూడా మంత్రి సబితా ఎమ్మెల్యేని అడగడం జరిగింది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పందిస్తూ ఎక్స్గ్రేషియా ఇచ్చే బాధ్యత నాది తప్పకుండా ఇస్తాను అని చెపారు. అనంతరం బార్బర్ షాపులకు 200 యూనిట్లు ఉచితంగా ఇచ్చేవిషయమై సిఎండి తో మాట్లాడుతూ చేనేతలకి 500 యూనిట్లు పైబడి వచ్చిన యూనిట్ కి బిల్లు కట్టే విధంగా ఉన్న పద్ధతి ప్రకారం నాయీబ్రాహ్మణ బార్బర్ షాపులకి కూడా 200 యూనిట్లు ఉచితంగా ఇచ్చి 200 యూనిట్లు కంటే ఎక్కువ కాల్చుకునేటువంటి యూనిట్లకు బిల్లు కట్టే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించటమైనది. ఆదరణ పథకం ద్వారా పనిముట్లు త్వరలో అందించటం జరుగుతుందని మంత్రి సబితా జేపీసీ ప్రతినిధి వర్గానికి తెలిపారు. మంత్రి సబితా టైం కేటాయించి సానుకూలంగా స్పందించి నాయీ బ్రాహ్మణ సమస్యలపై ప్రత్యేకంగా స్పందించటం స్వాగతించ వలసిన అంశం అని నాయీబ్రాహ్మణజేపీసీ ప్రతినిధి వర్గం సబితా వారిని ధుశ్యాలువా తో చిరు సత్కారం చేయడమైనది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ జేపీసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు టి దుర్గారావు ఎమ్ ఎస్ వి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

## వనస్థలిపురంలో అమావాస్య అన్నదాన సమితి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**వనస్థలిపురం/వన్ నేషన్ :** అమావాస్య అన్నదాన సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా మంగళవారం నాడు వనస్థలిపురంలోని కాంప్లెక్స్ వద్ద ఉన్న లక్ష్మీనరసింహస్వామి జ్యువెలరీస్ ముందు అన్నదాన కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఒక సంవత్సరం నుండి మేము ఇక్కడ అమావాస్య సందర్భంగా మా పెద్దల ఆశీ ర్వాదంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. అమావాస్య





రోజు అన్నదానం చేయడం వల్ల ఒకరి ఆకలి తీర్చడంతోపాటు ఎంతో పుణ్యం లభిస్తుందని తెలిపారు. ప్రతి నెల ఏర్పాటు చేసే అమావాస్య అన్నదాన కార్యక్రమంలో దాదాపుగా 1000 నుండి 1500 మందికి పైగా పాల్గొంటారని పేర్కొన్నారు. తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, విజయలక్ష్మి, ముఖేష్ అగర్వాల్, స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు.

# రామన్నపేట మండలంలో ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ

**యాదాద్రి జిల్లా : రామన్నపేట జూలై 14, (వన్ నేషన్) :** రామన్నపేట మండలంలోని హరిజనవాడ కాలనీలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎన్నికల ఎన్యుమరేషన్ ఫారాలను నింపి ఎన్నికల శాఖ సీనియర్ అసిస్టెంట్ రమావత్ వినీతాబాయి, బూత్ లెవల్ ఆఫీసర్ (BLO) మేడి లలితలకు అందజేశారు.ఈ సందర్భంగా ప్రజలు తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొడ్డు సాలయ్య, సురేందర్ రావు, గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ నకిరేకంటి రాములు తదితరులు పాల్గొన్నారు.



# విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

**ఎమ్మిగనూరు : జులై 14 డి కాసిం (వన్ నేషన్ ప్రతినిధి):** రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు డా మాచాని సోమనాథ్ ఆధ్వర్యంలో జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ కర్నూలు వారి సహకారంతో స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాలు యందు ఉచిత మెగా వైద్య శిబిరం





విజయవంతమైంది. మంగళవారం ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ కర్నూలు వారి వైద్య బృందం డాక్టర్ చంద్రశేఖర్ (వీణ), డాక్టర్ రాఘవేంద్ర చెరుకూరు, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ శ్వేత శశికళ వైద్య పరీక్ష నిర్వహించారు. అలాగే స్వతహాగా వైద్యులైనడా మాచాని సోమనాథ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. గార్లతో కలిసి కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలతో మమేకమై ఒక డాక్టర్ గా వారికి వైద్యసేవలు అందించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్న గౌ శ్రీ డా మాచాని సోమనాథ్. సోమనాథ్ ఆధ్వర్యంలో జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ కర్నూలు వారి సహకారంతో స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాలు యందు ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమాన్ని విజయవంతమైంది. మంగళవారం ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ కర్నూలు వారి వైద్య బృందం డాక్టర్ చంద్రశేఖర్ (MD), డాక్టర్ రాఘవేంద్ర చెరుకూరు, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ శ్వేత శశికళ వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే స్వతహాగా డాక్టర్ అయినా డా మాచాని సోమనాథ్ వైద్యం పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. వైద్య శిబిరం నిర్వహించడం తనకు ఎంతో ఆనందదాయకమైందని, భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

### గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన
# కుంగ్ ఫూ గ్రాండ్ మాస్టర్ పోచయ్యను అభినందించిన జగ్గారెడ్డి

### - భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించిన జగ్గారెడ్డి -
### పోచయ్యకు శాలువా కప్పి సన్మానించిన జగ్గారెడ్డి, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు గోపాల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్

**హైదరాబాద్, జులై 14 (వన్‌నేషన్):** కుంగ్ ఫూ కరాటే కటాలో అద్భుతమైన ప్రదర్శన చూపినందుకు, కేవలం అరగంటలోనే 72 సార్లు కటా ప్రదర్శించినందుకు 1,212 బృందానికి గిన్నిస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కింది. ఏప్రిల్ 26న గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఈ ప్రదర్శన జరిగింది. మూడు రోజుల క్రితం అధికారికంగా రికార్డును ధృవీకరిస్తూ సర్టిఫికెట్లను లండన్ నుంచి పంపించారు. ఈ ప్రదర్శనలో సంగారెడ్డి జిల్లాకు చెందిన కుంగ్ ఫు మాస్టర్ పోచయ్య తో పాటు అతని శిష్య బృంద సభ్యులు పాల్గొన్నారు. కుంగ్ ఫూ క్రీడకు సంబంధించి ఉమ్మడి మెదక్ జిల్లాలో తొలిసారిగా పోచయ్య బృందం ఈ అరుదైన ఘనతను సాధించింది. గతంలో ఉన్న ప్రపంచ రికార్డు వీరు బద్దలు కొట్టారు. గతంలో గంటలో 600 మంది కలిసి 30 30 సార్లు కటా ప్రదర్శించారు. ప్రస్తుతం బృందం కేవలం అరగంటలోనే 72 సార్లు కటా ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించారు. ఈ సందర్భంగా మంగళవారం సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని పోచయ్య కలిశారు. తాము నెలకొల్పిన రికార్డు గురించి ఆయనకు వివరించారు. అభినందించు ఈ విషయమై సంతోషం వ్యక్తం చేసిన జగ్గారెడ్డి, పోచయ్యను శాలువాతో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు.



# ఉప్పల్ సర్వేలో వేగం పెంచండి

**- జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమీక్ష - ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలి: ఎమ్మెల్యే ఆదేశం**



ఉప్పల్ /జూలై 14 /వన్ నేషన్ : ఉప్పల్ నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర సర్వే పురోగతిపై స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్త ఐఏఎస్‌తో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. సర్వే ప్రక్రియ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు సర్వేను మరింత వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రతి ఒక్కరికీ చేరాలంటే ఈ సర్వే అత్యంత కీలకమని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది మరింత అప్రమత్తంగా, చురుకుగా వ్యవహరించాలని, ప్రతి కుటుంబాన్ని కవర్ చేసేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్ రాధిక గుప్త స్పందిస్తూ, సర్వే పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పారదర్శకంగా సర్వేను పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, సిబ్బందిని మరింత పర్యవేక్షిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# ఓటు హక్కు నమోదులో నిర్లక్ష్యం వద్దు: మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

**- పీర్జాదిగూడలో ఓటర్ సవరణ (SIR) కార్యక్రమంపై అవగాహన సదస్సు - అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు గా నమోదు చేసుకోవాలని పిలుపు**



పీర్జాదిగూడ / జూలై 14/, వన్ నేషన్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి మరియు పీర్జాది గూడ వార్డులలో ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షిప్త ఓటర్ సవరణ (SIR) ప్రక్రి యపై పీర్జాదిగూడ మున్సి పల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రత్యేక సమీక్ష నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయ న బీఆర్ఎస్ పార్టీకి చెంది న బూత్ లెవల్ ఆఫీసర్లతో (BLO) సమావేశమై, సర్వే తీరుతెన్నులు మరియు క్షేత్రస్థాయిలో ఎదురవుతు న్న సమస్యలపై చర్చించా రు.అనంతరం, పీర్జాదిగూ డ కార్పొరేషన్ ఐదవ డివిజన్ మాజీ అధ్యక్షుడు మునుకుంట్ల కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన SIR అవగాహన మరియు ఫారాల స్వీకరణ' కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నా రు. ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది ప్రతి పౌరుడి బాధ్యత అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకో వాలని సూచించారు. సరైన సమయంలో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోకపోతే, భవిష్యత్తు లో ఓటు కోల్పోయే ప్రమా దం ఉందని ఆయన ప్రజల ను హెచ్చరించారు.ఓటర్ల నమోదు ప్రక్రియను పక డ్బందీగా నిర్వహించి, ఎవ రూ జాబితాకు దూరంగా ఉండకుండా చూడాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్, కొల్తూరి మహేష్, పీర్జాదిగూడ బీఆర్ఎస్ మాజీ జనరల్ సెక్రటరీ ఎడవెల్లి రఘువ ర్ధన్ రెడ్డి, వివిధ డివిజన్ల మాజీ అధ్యక్షులు యసా రం శ్రీనివాస్, కోనేటి వెంకట్, పార్టీ సీనియర్ నాయకులు శశిధర్ రెడ్డి, సతీష్, అమర్ పటేల్, సుబాన్ తదితరులు పాల్గొన్నారు.

# సెక్రటేరియట్ వద్ద ఉద్రిక్తత

**- ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కోసం విద్యార్థుల పోరు - స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆందోళన - ముట్టడికి యత్నించిన నాయకులను అడ్డుకున్న పోలీసులు**




హైదరాబాద్ /జూలై 14 /వన్ నేషన్ : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిల ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, వామపక్ష విద్యార్థి సంఘాలు మంగ ళవారం చేపట్టిన "చలో సెక్రటేరియ ట్" కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఏఐఎస్ఎఫ్ ,ఎస్ఎఫ్ఐ, పిడిఎస్ యూ, ఏఐఎఫ్డిఎస్, ఏఐఎస్బి, ఏఐడీఎస్ఓ మరియు ఏఐపిఎస్యూ వంటి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు సచివాలయం వైపు దూసుకు రావడంతో ఆ ప్రాంతం ఒక్క సారిగా విద్యార్థి సంఘాల నినాదాలతో దద్దరిల్లింది. ప్రభుత్వం సరైన సమయంలో ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థు ల చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని విద్యార్థి సంఘాల నాయకులు ఆవేద న వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయిం బర్స్మెంట్ బకాయిలను ప్రభు త్వం తక్షణమే విడుదల చేయాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు.శాంతి యుత పద్ధతిలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్న విద్యార్థి నాయకులను పోలీసులు అడ్డుకుని, బలవంతంగా అరెస్టు చేయడాన్ని వివిధ విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించా యి. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతుంటే ప్రభు త్వం పోలీసులతో అణిచివేసే ప్రయత్నం చేస్తోందని నాయ కులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు చేసినా తమ పోరా టం ఆపేది లేదని, బకాయిలు విడుదల చేసే వరకు ఉద్య మాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



# యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం

**- ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి : సిపిఎం - ఉద్యోగాల భర్తీకై జరిగే రేపు ఇందిరా పార్క్ వద్ద సిపిఎం మహాధర్నా జయప్రదం చేయండి - జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్**






యాదాద్రి జిల్లా : రామన్నపేట జూలై 14 (వన్ నేషన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు.వెల్లంకి గ్రామంలో కూరెళ్ళ నర్సింహాచారి అధ్యక్షతన జరిగిన సిపిఎం రామన్నపేట మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.దేశంలో, రాష్ట్రంలో లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఒకవైపు నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటే, మరోవైపు ఖాళీలను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు.ప్రతి ఏడాది లక్షలాది మంది యువత చదువులు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నా, తగిన ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. ఉద్యోగాల భర్తీలో జాప్యం, నియామక ప్రకటనల్లో ఆలస్యం, పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళన, నిరాశకు గురవుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయడం ద్వారా నిరుద్యోగ సమస్యను తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు బీజేపీ ప్రభుత్వం తక్షణమే వేయాలని. రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికెషన్స్ ఇచ్చి భర్తీ చేయాలి.ఈ నేపథ్యంలో జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాకు నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటి సభ్యులు బల్గురి అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు జంపాల అండాలు, కందుల హనుమంతు, మండల కమిటి సభ్యులు ఆవనగంటి నగేష్, గన్నేబోయిన విజయభాస్కర్,గొరిగే సోములు, నాగటి ఉపేందర్,బొడిగే రజిత, తొలుపునూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శులు మునికుంట్ల లెనిన్,తాళ్లపల్లి జితేందర్, శానగొండ వెంకటేశ్వర్లు,గోగు లింగస్వామి,జోగుల ధనలక్ష్మి, కొమ్ము అంజమ్మ, నాగటి లక్ష్మణ్, అప్పం సురేందర్, ఆముద ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమకు పరాకాష్ట.. 387వ ప్రదర్శనతో మరో మైలురాయి

**- 500 ప్రదర్శనల లక్ష్యంతో విజయవంతంగా దూసుకెళ్తున్న నాటకం.. మడుగుల కృష్ణమోహన్, జి. మధుప్రియ నటనకు ప్రేక్షకుల ప్రశంసల వెల్లువ**




హైదరాబాద్, జులై 14 (వన్‌నేషన్): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రదర్శించబడిన "ప్రేమకు పరాకాష్ట" సాంఘిక నాటకం తన 387వ విజయవంతమైన ప్రదర్శనను పూర్తి చేసుకుని మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. 500 ప్రదర్శనల లక్ష్యంతో విజయపథంలో సాగుతున్న ఈ నాటకం మరోసారి ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంటూ విశేష ఆదరణ పొందింది. ఈ నాటకానికి "రక్త కన్నీరు నాగభూషణం", "బళ్లారి రాఘవ" బిరుదుల గ్రహీత మడుగుల కృష్ణమోహన్ రచన, దర్శకత్వం, నిర్వహణతో పాటు ధనుంజయ పాత్రలో అద్భుత నటన కనబరిచి ప్రేక్షకులను భావోద్వేగాలకు గురిచేశారు. ప్రతి సన్నివేశంలో ఆయన చూపిన హావభావాలు, సంభాషణలలోని భావవ్యక్తీకరణ, రంగస్థలంపై ఆయన అనుభవం నాటకానికి ప్రధాన బలంగా నిలిచాయి. అలాగే "సహజనటి", "చలాకితార" బిరుదుల గ్రహీత జి. మధుప్రియ తన అసాధారణ నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. భావోద్వేగాలను అత్యంత సహజంగా ఆవిష్కరిస్తూ పాత్రకు జీవం పోసిన ఆమె అభినయానికి సభ అంతా చప్పట్లతో మార్మోగింది. పాత్రలో ఒదిగిపోయిన తీరు ప్రతి ప్రేక్షకుడిని కదిలించింది. నాటకంలోని ప్రతి పాత్ర, ప్రతి సంభాషణ ప్రేక్షకులను ఆలోచింపజేస్తూ ప్రేమ, అనుబంధాలు, మానవీయ విలువలను హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించింది. సాంకేతిక బృందం, రంగస్థల నిర్వహణ, సంగీతం, లైటింగ్, వేదిక రూపకల్పన కూడా నాటక విజయానికి విశేషంగా దోహదపడ్డాయి. 387వ ప్రదర్శనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కళాభిమానులు, ప్రేక్షకులు నాటక బృందాన్ని ఘనంగా అభినందించారు. 500 ప్రదర్శనల లక్ష్యాన్ని కూడా ఇదే విజయోత్సాహంతో చేరుకోవాలని పలువురు ఆకాంక్షించారు. "ప్రేమకు పరాకాష్ట" నాటకం కేవలం ఒక రంగస్థల ప్రదర్శన మాత్రమే కాకుండా, తెలుగు నాటక రంగ వైభవాన్ని చాటిచెప్పే అద్భుత కళాఖండంగా ప్రేక్షకుల మన్ననలు పొందుతోంది.



Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**















**హైదరాబాద్, జులై 14 (వన్‌నేషన్): సికింద్రాబాద్ లోని ఇంపీరియల్ గార్డెన్ లో జరిగిన నీ సురక్ష సహచరి పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరై ఆవిష్కరించిన మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ బి సుమతి ఐపీఎస్ ఇతర అధికారులు పాల్గొన్నారు**

# చెప్పాం.. చేస్తున్నాం

(1వ పేజీ తరువాయి)

ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు సాంత్వన కలిగించాలి. 100 శాతం సమస్యలు పూర్తిగా పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలి. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుంటుపల్లి లాంటి ప్రాంతాల్లో భూ సమస్యల్ని పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతీ నెలా 9న పంపిణీ చేస్తున్నాం. ఇంకా 72 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. అర్జీల పరిష్కారం కోసం నిబంధనల్లో మార్పులు తీసుకురావడం, లేదంటే చట్టాలను సవరించే అంశంపై విశ్లేషణ చేయాలి. మెరుగ్గా పనిచేస్తే 15 శాతం వృద్ధిరేటు సాధించే అవకాశం ఉంది. పాలన సులభతరం చేసేందుకు రెవెన్యూ వసూళ్లు పెంచుకునేలా కొన్ని ఏఐ టూల్స్ రూపొందించాం. ఈ ఏడాది వివిధ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది" అని చెప్పారు.

# కేంద్రంతో సఖ్యతగా..

(1వ పేజీ తరువాయి)

గుర్తుచేశారు. వివాదాస్పద రాజకీయ అంశాలను పక్కనపెట్టి, అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, అభివృద్ధి పనులను అడ్డుకునే విమర్శలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యంలో తెలంగాణ భాగస్వామి అవుతుందని రేవంత్ ప్రకటించారు. దేశ జనాభాలో కేవలం 2.5 శాతం ఉన్న తెలంగాణ, దేశ జీడీపీలో 5 శాతం భాగస్వామిగా ఉందని తెలిపారు. ఈ జీడీపీ వాటాను 10 శాతానికి పెంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నామని తెలిపారు. అలాగే, ఆర్థిక వృద్ధికి విమానాశ్రయాలు అత్యంత కీలకమని, అందుకే వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణాన్ని తక్షణ ప్రాధాన్యంగా తీసుకున్నట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దీనికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని ప్రశంసించారు. రామ్మోహన్‌తోపాటు ఆయన తండ్రి ఎర్రన్నాయుడితో తనకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. మెట్రో అంశంపై చర్చించేందుకు కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీపై ఇంకా స్పష్టత రాలేదని, పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మళ్లీ ఢిల్లీకి వచ్చి, మరికొంతమంది కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి అవసరమైన సహాయ సహకారాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణలో విమానాశ్రయాలు, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణాలకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారు. మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని.. ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను వివరించారు.

# జిల్లా బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**మంత్రాలయం జూలై 14 MD యూసుఫ్ (వన్ నేషన్) :** కోసిగి మండలము KGBV పాఠశాల లోలిలిభేటీ బచావో భేటీ ఫాడహో మరియు ఆత్మహత్యల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈసందర్భంగా సామాజిక కార్యకర్త యన్.నరసింహులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబడిన బేటి బచావో బేటి పడావో (బాలికను రక్షించండిబాలికను చదివించండి) ఈ పథకం యొక్క ప్రధానమైన







ఉద్దేశము బాలికల లింగ నిష్పత్తిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకురావడం జరిగింధనన్నారు నేటి సమాజంలో ఆడపిల్ల లంటే ఆర్థిక భారము, అనే మూఢనమ్మకాలు ఉన్నవారికి ఈ పథకం ఎంతగాను ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా సమస్యలకు ఆత్మహత్య పరిష్కారము కాదని జీవితములో ఎదురయ్యే సవాళ్లను ధైర్యరంగా ఎదుర్కోకుంటూ ముందుకు సాగాలన్నారు.విదార్థి దశలో మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, చదువుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు, నిరాశ, ఆందోళన వంటి కారణాలు మానసిక సమస్యలకు దారి తీస్తాయన్నారు.సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, స్నేహితులు లేదా అధికారులకు తెలియ చేసి వారి సలహాలు,సూచనలు తీసుకోవాలన్నారు, మరియు తల్లిదండ్రులు మందలించారని స్నేహితుల అవమానించారని పరీక్షలో ఫెయిల్ అయ్యామని మొదలైన సమస్యల వల్ల మానసిక ఒత్తిడి లోనే ఆత్మహత్యలకు పాల్పడడం సమస్యకు పరిష్కారం కాదని తెలిపారు ప్రశాంతంగా ఆలోచిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని మానసిక నిర్భరం కలిగి జీవించాలా ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు నెగిటివ్గా ఆలోచన చేయకుండా పాజిటివ్గా ఆలోచిస్టే సమస్యకు పరిష్కారం తెలుస్తుంది అన్నారు ముఖ్యంగా విద్యార్థులలో సెల్ఫ్ కాన్ఫరెన్స్ పెంపొందించాలంటే చదువుతోపాటు ఆటలు క్రీడలు యోగ, మెడిటేషన్ మొదలైనటువంటివి నిత్యజీవితంలో అలవాటు చేసుకోవడం వల్ల సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లెవెల్స్ డెవలప్ అవుతాయిన్నారు. .ముంక్యంగా కొంత మంది విద్యార్థులు పరిక్షల సమయములో పరిక్షల భయముతో మరియు పరీక్షలలో ఫెయిల్ అయినప్పుడు ఆత్మహత్య లకు పల్బడడము జరుగుతుంది ఆది సమస్య కు పరీక్షపరిష్కారము కాదు. చదువును ఇష్టంతో చదువుతూ మరియు ఒక్క ప్లాన్ ప్రకారం లేదా ఒక్కగోలు పెట్టుకొని చదువుతే విజయము సాధించవచన్నారు. విదార్థులలో సమస్యలు మనసులో దాచుకుంటే అవి ఆందోళనకు దారి తీస్తాయన్నారు. మరియు బాలల హక్కులకు, బాలల రక్షణకు భంగము కలిగినప్పుడు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమేన్ హెల్ప్ లైన్ 181, ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ 100,112 మొదలైన హెల్ప్ లైన్ నెంబర్లకు సమస్యలను తెలియ చేసి పరిష్కరించుకోవాలనీ వారికి అవగాహన కల్పించడం జరిగినది. అనతరము బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయడం జరిగిందిఈ కార్యక్రమంలో KGBV ప్రిన్సిపాల్ షబానా మరియు ఉపాధ్యానీయులు పాల్గొన్నారు.

# 11 ఏళ్ల సాన్వి లట్టాల చరిత్ర సృష్టించింది శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణ పతకాలు

**హైదరాబాద్/ వన్ నేషన్ :** శ్రీకాకుళంలో జూలై 11, 12 తేదీల్లో నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2026లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన 11 ఏళ్ల సాన్వి లట్టాల అపూర్వమైన చరిత్ర సృష్టించింది. అండర్-13, అండర్-15, అండర్-17 బాలికల సింగిల్స్ విభాగాల్లో వరుసగా విజేతగా నిలిచి మూడు స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. ఒకే జిల్లా ఛాంపియన్‌షిప్‌లో ఈ మూడు విభాగాల్లో విజేతగా నిలిచిన మొట్టమొదటి బాలికగా సాన్వి జిల్లా బ్యాడ్మింటన్ చరిత్రలో తన పేరును చిరస్థాయిగా నిలిపింది. ఇంకా విశేషమేమిటంటే, టోర్నమెంట్ మొత్తం ఒక్క మ్యాచ్‌లో కూడా ఒక్క సెట్‌ను కూడా కోల్పోకుండా అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.




## ఫైనల్ ఫలితాలు

అండర్-13 బాలికల సింగిల్స్ ఫైనల్ సాన్వి లట్టాల, రామ కేతనపై విజయం స్కోరు : 15-8, 15-7, అండర్-15 బాలికల సింగిల్స్ ఫైనల్ సాన్వి లట్టాల, చిత్రి జ్యోత్స్నపై విజయం స్కోరు: 15-6, 15-9, అండర్-17 బాలికల సింగిల్స్ ఫైనల్ సాన్వి లట్టాల, మోక్షిత నందినిపై విజయం స్కోరు: 15-7, 15-8, ఈ అద్భుత విజయంతో సాన్వి లట్టాల త్వరలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే అర్హత సాధించింది. టోర్నమెంట్ ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఐఏఎస్, శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు సాగర్, చైర్మన్ రాజేంద్రన్, సీఈఓ సూరిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు సాన్వి లట్టాల సాధించిన అరుదైన విజయాన్ని అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలోనూ ఇదే విజయపరంపర కొనసాగించాలని ఆకాంక్షించారు. సాన్వి విజయం ఆమె కృషి, క్రమశిక్షణ, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. మా అకాడమీ లక్ష్యం జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లను తయారు చేయడం. సాన్వి విజయం ఆ లక్ష్యానికి తొలి అడుగు మాత్రమేనని భవిష్యత్తులో మరెందరో క్రీడాకారులు ఇలాంటి విజయాలు సాధించి శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు కీర్తి



తీసుకురావాలని ఆశిస్తున్నామని తెలిపారు. సాన్వి లట్టాల సాధించిన ఈ చారిత్రాత్మక ట్రిబుల్ గోల్డ్ విజయం శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలవడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా యువ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.